# సమాజం కోసం

'పెద్దన'



కోర్టు హాలులోనికి అడుగు పెడుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణాదేవి తల ఎత్తి బోనులో నిలబడియున్న వ్యక్తిని చూచి ఉలిక్కిపడింది శుష్కించి పోయిన దేహం, గుంటలు పడిన ఆ కళ్ళు, మాసిన గడ్డంతో ఉన్న ఆ వ్యక్తిని చూస్తున్న అరుణాదేవి మనస్సు గతాన్ని తడుముతూ గుండెల్లో అణగారి పోయిన గాయాన్ని రగుల్కొలుపుతూ ఉంది. ఆ వ్యక్తి రాజశేఖరు కాదుకదా! సందేహంలేదు. అతను రాజశేఖరమే అనడానికి నిదర్శనం, ఆ కళ్ళల్లో ఉన్న పట్టుదల, ఎదుటి వ్యక్తిని సూటిగా ఒక్కచూపులోనే చదివేయగల తీక్షణమైన అతని కళ్ళు తనకి బాగా గుర్తు ఇతను ఇక్కడ ఈ పరిస్థితిలో...

ఒక్కసారిగా వర్తమానంలోనికి వచ్చిన అరుణాదేవి ఉలిక్కిపడింది ఏమిటిది? ఇప్పుడు తాను వాదించబోయే కేసులో ముద్దాయికాదు కదా! కేసు తాలూకు వివరాలు గుర్తు వచ్చి మనస్సు మొద్దుబారిపోయింది శరీరంభయాందోళనలతో కంపించింది. తనలోని రక్తమంతా గడ్డకట్టినట్లుగా, శరీరం చల్లబడిపోయింది. హృదయం బాధతో వేగిపోతున్నది. లాభంలేదు. ఈ కేసు తాను లీడ్ చేయలేదు.

ఆ కేసును విత్‌డ్రా చేసుకొని, తోటి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కి అప్పచెప్పి, కోర్టు హాలునుండి బయట పడింది.

కారులో ఇంటి దారి పట్టిన అరుణాదేవి గతం తాలూకు ఛాయలు వీడక ఆమె అంతరంగాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. అతను తనను గుర్తించాడా? అతడి చూపులు ఇక్కడ లేవు. ఎక్కడో భవిష్యత్తులో ఒక నవ్య వ్యవస్థను అవలోకిస్తున్నట్లుగా ఉన్నాయి. అతను తనని గమనించినట్లేలేదు.

తనకి బాగా గుర్తు ఆ రోజు కాలేజి డిబేటింగ్‌కి తాను కూడ హాజరైనది. ఫైనలియరు స్టూడెంటు రాజశేఖరం "రాజకీయ రంగములో విద్యార్థుల పాత్ర" గురించిఎంతో ఉద్రేకంగా, ఆవేశంగా చెపుతుంటే అవాక్కయిపోయి వింటూ బొమ్మలా నిల్చుండిపోయింది. అతని ఆదర్శాల గురించి, దేశంలో సమానత్వానికై అతడు పడే ఆరాటం గురించి తాను చాల సార్లు తన స్నేహితుల ద్వారా విన్నది. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తుంటే విద్యార్థి దశలోనే రాజకీయాలలో బాగా అనుభవం గడించిన వ్యక్తిలాకనిపిస్తున్నాడు అతని విప్లవాత్మకమైన భావాలు, ఆశయాలు గురించి బాగా తాను విన్నది నిలువెత్తు విగ్రహం, ఎర్రబడిన మొహం, ఉద్రేకంతో అతను పలికే ఒక్కొక్క మాటకు విద్యార్థులంతా కరతాళధ్వనులు చేస్తున్నారు అతని స్వరములో ఆవేశమేకాక, ఆవేదన కూడా ఉంది. అతని ధోరణి చూస్తుంటే దేశం కోసం ఏదైనా చేయుగల త్యాగమూర్తిలా కనుపించాడు. "దేశం కోసం, దేశ భవిష్యత్తు కోసం విద్యార్థులు రాజకీయ రంగంలో ప్రవేశించాలని, ప్రజలకు కనీస అవసరాలు తీర్చలేని ప్రభుత్వాన్ని విద్యార్థులే పడగొట్టాలని, అన్ని రంగాలలో ముఖ్యంగా విద్యా

రంగములో ఉన్న అవినీతిని విద్యార్థులే తొలగిం చాలని, ఇందుకు తగిన చైతన్యం విద్యార్థులు అలవరచుకోవాలని, నవ్య వ్యవస్థను స్థాపించే బాధ్యత ఈ నాటి యువకులదేనని'' అతను బల్లగుద్ది వాదిస్తుంటే విద్యార్థులలో ఆవేశం పెల్లుబికి హర్షధ్వానాలతో అతని చుట్టూ ముట్టి వేసారు. వీలైనప్పుడల్లా విద్యార్థులను సమీకరించి అతను బోధించే విప్లవాత్మక విషయాలు లెక్చరర్లకు కూడా చర్చనీయాంశము లుగా తయారైనాయి. ఎప్పటికైనా అతను గొప్ప విప్లవకారుడుగా తయారవుతాడని లెక్చరర్లు, సాటి విద్యార్థులు జోస్యం చెప్పేవారు.

ఆ రోజు కారులో తాను కాలేజీకి వస్తుంటే ఎదురుగా తలవంచుకువస్తున్న రాజశేఖరాన్ని చూచి సడన్ బ్రేకుతో కారాపి విష్ చేసింది!

''హలో గుడ్ మార్నింగ్ రాజశేఖరం గారూ!''

''గుడ్ మార్నింగ్!''

ప్రశ్నార్థకంగా అతని చూపులకు తనను తాను పరిచయం చేసుకుంది.

''నా పేరు అరుణ. కాంట్రాక్టరు వెంకట్రావుగారి అమ్మాయిని.''

''ఐ. సి.'' అతని పెదవులపై చిరునవ్వు.

''రండి. డ్రాప్ చేస్తాను.''

''నో, థాంక్స్. నడిచి వెళ్ళగలను ''

ఒక్క క్షణం చివుక్కుమంది మనసు. అంతలోనే సర్దుకొని డోర్ తెరిచి ''ప్లీజ్'' అంది. ''ఆల్ రైట్'' అంటూ కారెక్కి తలుపు మూసాడు.

# సమాజం కోసం

తన ప్రక్కగా కూర్చున్న అతని దుస్తులకు, తన దుస్తులకు గల తేడా మనసును కలచివేసింది. రాజశేఖరం ఆర్థికమైన ఇబ్బందులమధ్య పెరిగాడని, చదువు కూడా అతి కష్టంమీద కొనసాగిస్తున్నాడని తాను విన్నదే కాని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తుంటే అతని పరిస్థితి అర్థమవుతున్నది. ముభావంగా కూర్చున్న అతనితో సంభాషణ కలపాలని—

''మా నాన్నగారు మీలాటి అభ్యుదయ భావాలు కల యువకులంటే చాలా లైక్ చేస్తారు'' అన్న తన మాటకి అతనికళ్ళల్లో లిప్తకాలం కనిపించిన నిరసన భావం తన కంట పడకుండా పోలేదు. ఏమిటిది?డబ్బుగల వారంటే ఇతనికి ఏహ్యభావమా? అనుకున్నది. కారు కాలేజి గేటు దాటి ఆవరణలోనికి ప్రవేశించినది. కారు దిగి ''థాంక్స్'' చెప్పి గంభీరంగా వెళ్తున్న అతని 'మూర్తి' తన హృదయంలో చెరగని ముద్ర వేసింది.

వీలైనప్పుడల్లా అతని డిబేటింగ్స్ ఉంటే వెళ్ళేది. రెండు, మూడుసార్లు పలకరించబోయినా ముక్తసరిగా జవాబులు చెప్పి వెళ్ళేవాడు. ఏ అమ్మాయిల వంక కన్నెత్తి చూడటముకాని, అనవసర సంభాషణలకు కాని వీలు కల్పించేవాడు కాడు. అతని కళ్ళల్లో బలీయమైన ఆశయాలు కదలాడు తుండేవి. తన ఆశయ సిద్ధిని నెరవేర్చుకొనే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు ఉండేది అతని ధోరణి. ఎందుకో ప్రతిక్షణం అతను గుర్తుకు వచ్చేవాడు. అతనిపట్ల ఒకవిధమైన గౌరవభావం, ఇంకేదో తెలియని భావము తనలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో,రాజశేఖరం చదువుకు ''గుడ్ బై'' చెప్పి తీవ్రవాదుల ఉద్యమంలో చేరినట్లుగా వార్త కాలేజీలో వ్యాపించింది. రాజశేఖరం ప్రవర్తన బట్టి ఇటువంటిదేదో ముందుగానే ఊహించినా, అతను ఆ విధంగా చేయటం ఒక విధమైన కలవరపాటునే కలిగించింది. అతని ఆశయసిద్ధికై ఎన్నుకున్న బాట సరైనది కాదేమో!క్రమంగా అతని జ్ఞాపకాలు మరుగున పడ్డాయి.

గతాన్ని నెమరువేసుకుంటున్న అరుణ సడన్ బ్రేక్‌తో కారాపి వాస్తవంలోనికి వచ్చి, ఎదుటి దృశ్యాన్ని చూచిన అరుణ మనస్సు విలవిలలాడింది రోడ్డుప్రక్కగా'డస్ట్‌బిన్'లో పారవేసిన ఎంగిలి మెతుకుల కోసం పోటా పడుకుంటున్న ముగ్గురు పిల్లలు, మాకూ వాటా కావాలని కలబడుతున్న రెండు కుక్కలు కనిపించాయి. కనీసం పిల్లల ఒంటిమీద పాత గోచి అయినా లేదు. ఆ దృశ్యాన్ని చూస్తున్న అరుణ మనస్సు వికలమైపోయింది. దేశంలో ఎందరో దౌర్భాగ్యులు ఇంటటి దయనీయ స్థితిలో దిక్కులేక ఆకలితో అలమటిస్తుంటే, తన దేశంలో తనతోటి మనుష్యుల కోసం ఏదోచేయాలనే వెర్రి ఆవేశంతో ప్రాణాలను, తమ భవిష్యత్తునుసహితం లెక్కచేయక దేశం కోసం ఉద్యమించే రాజశేఖరం లాటి వ్యక్తులు కళ్ళముందు కదలాడారు

ఎందరో రాజశేఖరంలు దేశం కోసం తమ భవిష్యత్తును బలి పెడుతూనే ఉన్నారు.దౌర్జన్యంగా అయినా వ్యవస్థను మార్చాలన్న రాజశేఖరంలాటి వ్యక్తుల అభిప్రాయం 'తప్పు'అని, అవి సంఘ విద్రోహక చర్యలుగా, చట్టాన్ని ఎదిరించటము అని న్యాయ స్థానాలు తీర్పు ఇస్తే ఇక విప్లవం ఏ రూపంగా వస్తుందో! ఎటునుంచి వస్తుందో అంతుపట్టక దేశవాసులందరూ ఎవరికివారే చేతులు ముడుచుకు కూర్చుంటే, ఎంగిలాకులకై కొట్టుకునే ఇటువంటినిస్సహాయులజీవితాలు బాగుపడేదెప్పుడు? దేశం సమానత్వాన్ని సాధించేదెప్పుడు? అనే ప్రశ్నలు అరుణ అంతరంగములో ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఎంగిలి మెతుకులు ఆవురావురుమని తింటున్న పిల్లలపై దృష్టిని నిగిడ్చి శూన్యమైన చూపులతో, భారమైన హృదయంతో స్టీరింగుపై తలవాల్చి కూర్చుండిపోయింది అరుణ.

